క్లుప్తంగా

పుట్ట పెద్దమ్మకు పూజలు


పూజలందుకున్న అమ్మవారు

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. అలాగే అమ్మవారి శాలలోని వాసవీ మాతకు ఆర్యవైశ్యులు, కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవి, సిమెంట్ నగర్ గ్రామంలో వెలసిన సుంకులా పరమేశ్వరీ దేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

బాల్య వివాహాలను అరికడదాం


దుస్తులను పంపిణీ చేస్తున్న బ్రహ్మానంద ఆచారి

బనగానపల్లె రూరల్: బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి సూచించారు. మంగళవారం పలుకూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గోర్లగుట్ట బుగ్గరామేశ్వరి భక్త మండలి సహకారంతో అంగన్‌వాడీ చిన్నారులకు దుస్తుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బ్రహ్మానంద ఆచారి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల తల్లి, బిడ్డకు ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు రమణమ్మ, మనోహరమ్మ, ప్రవంతి, రమలమ్మ, శ్రీదేవి, ఉపాధ్యాయులు మధుకిశోర్ పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక అలంకరణ


కనకదుర్గమ్మ

డోన్: స్థానిక పాత బస్టాండ్ సమీపంలో వెలసిన కనకదుర్గ అమ్మవారికి మంగళవారం భక్తులు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తురాలు పుచ్చకాయల లక్ష్మి పట్టువస్త్రాలు సమర్పించారు.

సేవాగుణం అలవర్చుకోవాలి


పింఛన్ అందజేస్తున్న ప్రకృతి పీఠం అధ్యక్షుడు

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దాన ధర్మాలకు వినియోగించాలని ప్రకృతిపీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక పరంధామ నిలయంలో పట్టణానికి చెందిన 150 మందికి రూ.100 చొప్పున పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల నుంచి ప్రతి నెలా పేదలకు తన వంతు సాయంగా పింఛన్లు అందజేస్తున్నానన్నారు. కార్యక్రమంలో ప్రకృతి పీఠం ఉపాధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ, రిటైర్డ్ హెచ్ఎం నారాయణస్వామి, సభ్యులు మహేశ్వరరెడ్డి, రాములమ్మ, పాల్గొన్నారు.

విద్యుత్‌స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల- ముదిగేడు ఆర్ అండ్‌బీ రహదారిలో 8.33 కేవీ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన విద్యుత్ స్తంభాన్ని మంగళవారం సాయంత్రం ట్రాక్టర్ ఢీకొంది. కోవెలకుంట్ల వైపు నుంచి ఇటుకల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ప్రమాదశాత్తూ స్తంభాన్ని ఢీకొట్టగా స్తంభం కూలిపోయింది. అదే సమయంలో విద్యుత్ ట్రిప్ కావడంతో సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కోవెలకుంట్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసే మెయిన్ లైన్ కావడంతో సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు యుద్ధప్రాతిపదికన ఘటనా స్థలానికి చేరుకుని కొత్త స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

మన మిత్ర యాప్ సేవలపై అవగాహన

బనగానపల్లె రూరల్: ప్రభుత్వానికి సంబంధించిన 26 విభాగాల సేవలు మన మిత్ర యాప్ ద్వారా పొందవచ్చని ఎంఈఓ స్వరూప సూచించారు. మన మిత్ర యాప్‌పై విద్యార్థులతో కలిసి మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం నుంచి పెట్రోల్ బంకు సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ బాలాంజనేయులు, ఈఓ సతీష్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌డీఏ ఏపీఎం హజరత్, సచివాలయ ఉద్యోగులు, పాఠశాలల చెందిన హెచ్ఎంలు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మల్లా గోదాములు!

రైతన్నలకు ఉపయోగపడాల్సిన గోదాములు దిష్టిబొమ్మల్లా ఉండిపోయాయి. అన్నదాత కోసమని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు వెచ్చించి నిర్మించిన గోదాములు కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎందుకూ పనికి రాకుండా మిగిలిపోయాయి. ధాన్యం నిల్వ చేసుకోవచ్చని సంబరపడిన రైతన్నల ఆశలపై కూటమి నేతలు నిర్లక్ష్యపు నీళ్లు చల్లి అందుబాటులో తీసుకురాకుండా కాలయాపన చేస్తున్నారు.


బనగానపల్లె మండలం పసుపల వద్ద నిర్మించిన గోదాము,


రవ్వలకొండపై నిర్మించిన గోదాము

- వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మాణం
- కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిరుపయోగం

బనగానపల్లె: గిట్టుబాటు ధర లభించేంత వరకు ధాన్యం నిల్వ చేసుకునేందుకని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో 10,00,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన బహుళప్రయోజన సౌకర్య గోదాములను నిర్మించారు. అందులో భాగంగా బనగానపల్లె మండలంలోని భానుముక్కల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో రవ్వలకొండపై రూ.70 లక్షలతో 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గోదాము, నందవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో పసుపలలో 1,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములను నిర్మించింది. టంగుటూరు సహకార సంఘం పరిధిలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాము కైప వద్ద, నందవరం సహకార సంఘం పరిధిలో ఇల్లూరుకొత్తపేట జగనన్న కాలనీ వద్ద మరో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గోదాముల నిర్మాణాలు చివరి దశకు చేరుకున్నాయి. అంతలోపే ప్రభుత్వం మారింది. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి పూర్తయిన గోదాములు ప్రారంభానికి నోచుకోలేదు. చివరి దశలో ఉన్న పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. గోదాములు నిర్మాణ పనులు పూర్తయినా వాటిని ప్రాథమిక సహకార సంఘాలకు అప్పగించకపోవడంతో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్మాణాలు పూర్తయిన గోదాములను ప్రాథమిక సహకార సంఘాలకు అప్పగించాలని రైతులు కోరుతున్నారు.


ఇల్లూరుకొత్తపేట జగనన్న కాలనీ వద్ద నిర్మాణంలో ఉన్న గోదాము

ప్యానల్ ఇంజినీర్లు పరిశీలించాలి

నిర్మాణ పనులు పూర్తయిన వ్యవసాయ గోదాముల వివరాలను నివేదిక రూపంలో సంబంధిత బ్యాంకు అధికారులకు అందజేశాం. గోదాములను బ్యాంకు అలాట్‌మెంట్ ద్వారా ప్యానల్ ఇంజినీర్లు తనిఖీ చేసి నివేదికను అందజేయాలి. ఆ తరువాత వాటిని ప్రాథమిక సహకార సంఘాలకు అప్పగిస్తారు. ఇక నిర్మాణంలో ఉన్న గోదాముల పనులు త్వరగా పూర్తి చేయిస్తాం.

– రఘురామిరెడ్డి, డీఈఈ, వ్యవసాయ మార్కెట్ కమిటీ


ఎస్ఆర్‌బీసీ ప్రధాన కాల్వ ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలు

కాల్వ కనుమరుగు!

- ఇరువైపులా ముళ్లపొదలు
- ఉనికిని కోల్పోతున్న ఎస్ఆర్‌బీసీ ప్రధాన కాల్వ

బనగానపల్లె: గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ వరకు సుమారు 60 కిలోమీటర్ల ఎస్ఆర్‌బీసీ ప్రధాన కాల్వ రోజురోజుకూ తగ్గిపోతోంది. పట్టణ సమీపం నుంచి అవుకు రిజర్వాయర్ వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర ఇరువైపులా ముళ్లపొదలు పెరిగి కనుమరుగవుతోంది. తొలగించాల్సిన అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముళ్లపొదల వేర్లు కాల్వ లోపలి భాగానికి చొచ్చుకెళ్లి కోతకు గురయ్యే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాల్వలోపలి భాగంలో ముళ్ల పొదలు పెరుగుతుండటంతో నీటి ప్రవాహానికి కూడా ఇబ్బందిగా ఉంటుందన్న విషయాని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ముళ్లపొదల తొలగింపునకు చర్యలు తీసుకుని కాల్వ కోతకు గురికాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న డోన్ డిప్యూటీ ఈఓ

కోవెలకుంట్ల: తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలకు ఎంపికైనట్లు పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల హెచ్ఎం గీతా తెలిపారు. విద్యార్థులను మంగళవారం డోన్ డిప్యూటీ ఈఓ వెంకట్రామిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు హర్ష, ఓబులేసులతో కలిసి ఆమె అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ నంద్యాలలోని బాలాజీ కాంప్లెక్స్ సీబీఎస్ఈ క్రీడామైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి జంప్‌రోప్ అండర్–12 విభాగంలో తమ విద్యార్థులు కుందన్, శ్రీకృష్ణదేవరాయలు, ప్రణవి, శ్రీవల్లి, పవిత్ర, హాసిని, బ్లేస్సి, మద్దిలేటి, సతీష్, హరిణి, జ్యోత్స్న, హేమచంద్ర, ధనస్విని, లాస్య, అండర్ 14 విభాగంలో మహమ్మద్, కావ్య, ధార్మిక, నీరజ్, శివకార్తీక్, నందన్ సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

32.6 మి.మీ వర్షపాతం నమోదు

కొలిమిగుండ్ల: ఉపరితల ఆవర్తనం కారణంగా వర్షం కురవడంతో వర్షధార పంటలకు ఊరట లభించింది. మంగళవారం తెల్లవారు జామున 32.6 మి.మీ వర్షపాతం నమోదైంది. రెండు రోజుల నుంచి మోస్తారు వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న,కంది,మినుము తదితర పంటలకు మేలు చేకూరింది. మండలంలో ఇప్పటి వరకు భారీ వర్షం కురవక పోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. ఇప్పటికే చాలా బోర్లలో నీళ్లు రాక పోవడంతో వృధాగా మారాయి. సాధారణ, మోస్తారు వర్షాలు మాత్రమే కురుస్తున్నాయి. భారీ వర్షాలు కురిసి వాగులు,వంకలు ఉప్పొంగితే తప్ప భూగర్భ జలాలు పెరగవని రైతులు అభిప్రాయ పడుతున్నారు. చెరువుల్లో కూడ నీళ్లు లేక బోసిపోతున్నాయి. వాతావరణ శాఖ ఇంకా రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని చెప్పడంతో భారీ వర్షం వస్తుందనే నమ్మకంతో ఉన్నారు.

ప్రత్యేక పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని శనగన బసవన్నగా పేరు పొందిన నందీశ్వరునికి, క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడైన వీరభద్రునికి , నందీశ్వరునికి, కుమారస్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజను చేశారు. అనంతరం నందీశ్వర స్వామికి, వీరభద్ర స్వామికి, కుమారస్వామికి విశేష పూజలు నిర్వహించారు.

8న సామూహిక వరలక్ష్మీ వ్రతం

మహానంది: ఈనెల 8న సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు మహానంది దేవస్థానం ఈఓ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. మంగళవారం కార్యాలయంలో వారు మాట్లాడుతూ వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనే మహిళలకు నంద్యాలకు చెందిన ఏజీఎస్ జువెలర్స్ అధినేత అవ్వారు గౌరీనాథ్, సరస్వతి దంపతుల సహకారంతో పూజా సామగ్రి, ప్రసాదాలు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఈఓ ఎరమల మధు, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఈఓ, వేదపండితులు

ఆవులు, పందులు రోడ్లపై వదలద్దు


మాట్లాడుతున్న నగర పంచాయతీ కమిషనర్

బేతంచెర్ల: పట్టణంలోని ఆవులను, పందులను వీధుల్లోకి వదిలితే చర్యలు తప్పవని కమిషనర్ హరి ప్రసాద్, ఎస్ఐ తిరుపాలు, సూపరిండెంట్ దస్తగిరి బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో రైతు సంఘం నాయకులు, రైతులు, ఆవులు, పందుల యజమానులతో సమావేశం నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ ఆవులు రహదారులపైకి వచ్చి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, పంటపొలాలకు నష్టం కల్గిస్తున్నాయని, పందుల వల్ల కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. 10 రోజుల్లోగా ఎవరి ఆవులను, పందులను వారు తమ ఇళ్ల వద్ద ఉంచుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, ఎస్ఐ తిరుపాలు తెలిపారు. నిబంధనలను అతిక్రమిస్తే ఆవులను గోశాలకు, పందులను దూర ప్రాంతాలకు తరలిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సూపరింటెండెంట్ దస్తగిరిబాబు, ఆర్ఐ హేమంత్ రెడ్డి, రైతు సంఘం నాయకులు శ్రీధర్‌రెడ్డి, హుసేన్ రెడ్డి, రమణారెడ్డి, భూషిరెడ్డి, సంజీవుడు, మహేశ్వర్‌రెడ్డి, మధు లోకేష్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

బేతంచెర్ల: ఎంఈఓ-2గా జెడ్పీ హైస్కూల్ (మెయిన్) హెచ్ఎం అబ్రహ్మం మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను ఇన్‌చార్జ్ హెచ్ఎం హరికృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు.

హామీలు అమలు చేయాలి

బనగానపల్లె రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏసురత్నం డిమాండ్ చేశారు. మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా హామీలు అమలు చేయకపోవడం తగదన్నారు. కనీసం వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, యాప్‌ల భారం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: దేవరబండ సబ్ స్టేషన్ పరిధిలో మిద్దెపల్లె ఫీడర్ కింద రూరల్ డెవలప్‌మెంట్ పనులు జరుగుతున్న కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మిద్దెపల్లె, అనుపల్లె, రేకులకుంట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు ఏఈ నాగేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు త్రీఫేస్ కరెంట్ తెల్లవారు జామున 3 నుంచి ఉదయం 10 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఇస్తామన్నారు.

ఎంఈఓల నియామకంలో వివక్ష తగదు


సభ్యత్వం నమోదు చేయిస్తున్న నాయకులు

డోన్ టౌన్: ఎంఈఓల నియామకంలో వివక్ష తగదని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు బీవై సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు ఉఎస్ఎస్ బాబు అన్నారు. మంగళవారం గుమ్మకొండ గ్రామంలోని పాఠశాల ఉపాధ్యాయులతో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న మండల విద్యాశాఖ అధికారుల పోస్టులకు కేవలం ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లను నియమించడం తగదన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ యాజమాన్యాల పాఠశాలల హెచ్ఎంలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సీనియార్టీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సద్దల గోపాల్, సుభాన్, సుమన్, ప్రసాద్, హుస్సేన్‌బాషా, శివుడు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో జమ కాక పాట్లు

కొలిమిగుండ్ల: కూటమి ప్రభుత్వం ఇటీవలనే అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో నగదు జమ చేసింది. మండలంలో చాలా మందికి తమ వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ కాక పోవడంతో ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్దకు తిరుగుతున్నారు. మండలంలో అన్నదాత సుఖీభవ కింద 6,197 మంది రైతులు అర్హులుగా నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ కింద రూ.2వేలతో కలిపి రాష్ట్ర వాటా రూ.5 వేల మొత్తం రూ.7వేలు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇందులో కొంత మంది రైతులకు రూ.2వేలు జమ కాగా రూ.5వేలు పడలేదు. మరికొంత మందికి అసలే జమ కాకపోవడంతో వ్యవసాయాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ-కేవైసీ, ఎన్‌పీసీఐ లింక్ చేయించుకున్నా డబ్బు జమకాక పోవడంతో రైతులు అయోమయంలో పడుతున్నారు. అధికారులను సంప్రదిస్తే గ్రీవెన్స్‌లో నమోదు చేస్తున్నామని, మళ్లీ జమ అవుతాయని చెబుతున్నారని రైతులు పేర్కొంటున్నారు.

ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకోవాలి


ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న జయదేవానంద

కోవెలకుంట్ల: పురాణాలు, వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు చదివి ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచారకులు జయదేవానంద సూచించారు. మంగళవారం మండలంలోని రేవనూరులో టీటీడీ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుని కథా శ్రవణము మానవులను దు:ఖరహితులను చేసి ఉత్తమ గతులను ప్రాప్తింప చేస్తుందన్నారు. వేదాలు పఠించడం వల్ల ఉత్తమ మార్గం వైపు పయనించవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాస్కర్, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు మల్లు వెంకటరెడ్డి, ఆలయ ధర్మకర్త సంజీవరెడ్డి, భజనమండలి సభ్యులు వెంకటరెడ్డి, శంకర్‌రెడ్డి, శివరామిరెడ్డి, హనుమంతరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, ఉసేనయ్య, నాగమలేశ్వరరెడ్డి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాతో ఉద్యోగ అవకాశాలు సాధించాలి


జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల: జాబ్ మేళా ద్వారా యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాబ్ మేళా పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కోవెలకుంట్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 12న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 9182217075, 9951400588 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజా మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలి


సీపీఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్: బషీర్ భాగ్ విద్యుత్ ఉద్యమ తరహాలో ఏపీలో మరో విద్యుత్ ఉద్యమానికి ప్రజలు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివరామ్, సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, రామాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, పట్టణ, మండల కార్యదర్శులు మోటా రాముడు, నారాయణ పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా మంగళవారం సీపీఎం, సీపీఐ నాయకులు వేర్వేరుగా ఆందోళనలు నిర్వహించారు. పెంచిన ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కోరుతూ స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా వామ పక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి తొత్తుగా మారిన రాష్ట్ర ప్రభుత్వం పేదలపై విద్యుత్‌భారం మోపేందుకు ఆదాని స్మార్ట్‌మీటర్ల బిగింపు కార్యక్రమం చేపట్టిందని, వీటిని ప్రజలు వ్యతిరేకించాలన్నారు.

స్మార్ట్ మీటర్ల భారం మోపొద్దు

బనగానపల్లె రూరల్: స్మార్ట్ మీటర్ల భారం మోపొద్దని సీపీఐ మండల కార్యదర్శి శివయ్య డిమాండ్ చేశారు. పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల ముందు గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించబోమని, కరెంట్ చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం మాట మార్చడం తగదన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని విద్యుత్ ఏఈ శ్రీనివాసులకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు సుబ్బారెడ్డి, నాయకులు ఎర్రిస్వామి, శివగంగయ్య, ఖాదర్, నాగాంజనేయులు, మధు, రాజ్ పాల్గొన్నారు.

- బేతంచెర్ల: కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చి విద్యుత్ చార్జీల భారాలను ప్రజలపై మోపుతుందని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలని మంగళవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం రూరల్ ఏఈ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు.
- కోవెలకుంట్ల: పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల నడ్డి విరిచేలా ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు సుధాకర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డె సుబ్బరాయుడు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు కూటమి నేతలు హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి ఎడా పెడా విద్యుత్ చార్జీలు పెంచి అన్ని వర్గాల ప్రజలపై భారం మోపిందన్నారు. స్మార్ట్‌మీటర్లను తొలగించడంతోపాటు పెంచిన విద్యుత్‌చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ అనంతరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు దేవరాజు, త్యాగరాజు, సుబ్బారెడ్డి, మురళీ, కిరణ్, అక్బర్‌బాష, నవీన్ పాల్గొన్నారు.
- కొలిమిగుండ్ల: స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పడుతుందని సీఐటీయూ మండల అధ్యక్షుడు మహేష్ అన్నారు. మంగళవారం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేసి, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌ఇంజినీర్ లక్ష్మణస్వామికి వినతి పత్రం అందజేశారు.
- ప్యాపిలి: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి మహేశ్, సీనియర్ నాయకులు వెంకటేశ్ డిమాండ్ చేశారు. స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం ఆవరణలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలోనే సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారం ప్రజలపై మోపిందన్నారు. ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్, నాయకులు రామచంద్రుడు, శ్రీను, మోహన్ పాల్గొన్నారు.